# అస్థిపంజరం

## —వసుంధర—

ఆ ఊరి సంతలో ఎత్తైన సిమెంటు గట్టుమీద కూర్చుంటాడతడు. అతడిముందు బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లిపాయలు, దొండకాయలు ఉంటాయి. వంకాయల లాంటివి ఎప్పుడో కానీ ఉండవు. నేనెప్పుడు సంతకు వెళ్ళినా అతడి దగ్గరకే వెళ్ళి "మంచి సరుకు ఇవ్వాలి సుమా!" అంటాను.

"బాబుగారడిగితే మాత్రం చెడ్డ సరుకిస్తానా!" అంటాడతడు. నేనేరుకోనని అతడికి తెలుసు.

"నేను బేరంకూడా ఆడను. న్యాయమైన ధర చెప్పు" అంటాను. అతడు వెంటనే "బాబుగారి దగ్గర ఎక్కువ తీసుకుంటానా!" అంటాడు.

అతడికి నా మీద ప్రత్యేకాభిమానమేమీ లేదు. తనదగ్గర కొచ్చిన కష్టమర్లందరితోనూ అతడలాగే అంటాడు. అతడి నుంచి ఎన్నోసార్లు నాకు చెడ్డసరుకు వచ్చింది. కొన్నిసార్లు ధరకూడా అతడివద్ద ఎక్కువేననిపించింది. అయినప్పటికీ నేను విధిగా అతడివద్దనే కూరలు కొంటాను. అతడివద్ద దొరకనివి మాత్రమే ఇతరులవద్ద కొంటాను.

నేను తన వద్ద తప్పఇంకెవరివద్దా కొనని అతడికి తెలుసు. అందుకే నేనుండగా తనవద్దకింకెవరైనా కష్టమర్సు వస్తే వాళ్ళతో గర్వంగా "బాబుగారు నా దగ్గరతప్ప ఇంకెక్కడా కొనరు" అని గర్వంగా చెబుతుంటాడు

శ్రీమతికి అతడంటే అంతగా పడదు. ఇంకా చౌకగా ఇంక మంచి సరుకు కొనే అవకాశం వుండగా అతడివద్దనే ఎందుకు కొనాలి అంటుందామె. అందుకు నేను చెప్పిన కారణం ఒక్కటే. అతడి రూపు.

క్లుప్తంగా చెప్పాలంటే అతడి బుర్ర పుర్రెలా వుంటుంది. మనిషి అస్థిపంజరంలా వుంటాడు. చూడగానే ఈ మనిషెలా బ్రతుకున్నాడు, ఇంకా ఎంతకాలం బ్రతుకుతాడు అనిపిస్తుంది. అతడి వయసు డెబ్భైకి తగ్గదనిపిస్తుంది. అతడి శరీరంలో ఏమాత్రం మాంసం వుండదనిపిస్తుంది.

అటువంటి స్థితిలో ఆ వయసులో విశ్రాంతి తీసుకోడానికి బదులు సంతలో కూరలమ్ముకుంటున్నాడంటే నాకేదో వెలితిగా అనిపిస్తుంది. అతడిని చూడగానే చెప్పలేని జాలి కలుగుతుంది. అయితే అతడికి నేను చేయగలిగిన దేముంది.

అలాంటి వాళ్ళ నాదుకోవడానికి రాజకీయ నాయకులున్నారు. వాళ్ళు గరీబీ హటావో అని నినాదాలు చేసి తమ చేతులు దులిపేసు కుంటున్నారు.

వాళ్ళకంటే నేను కాస్తమెరుగు. అతడి దగ్గరే అతడిచ్చిన కూరలు అతడిచ్చిన ధరకే కొంటాను. అదే అతడికి నేను చేయగల సాయం.

శ్రీమతికి మాత్రం నా జాలికి అర్థం లేదంటుంది. ఎందుకంటే అతడు పది రూపాయల్లోంచి రూపాయి డెభై రెండుపైసలు తీసేస్తే ఎంతో కాల్క్యులేటరంత వేగంగా చెబుతాడు. కూరలు తక్కువ వారికంటే చలాకీగా తూస్తాడు. ఎప్పుడైనా చిల్లర లేకపోతే సిమెంటు గట్టు మీంచి ఒక్క దూకు దూకి క్షణాలమీద ఎక్కడికో వెళ్ళి చిల్లర తెస్తాడు.

శ్రీమతి అతడిలో మనిషిని చూస్తుంది. నేనతడిని బ్రతికున్న అస్థిపంజరంలా చూస్తాను. అంటిపెట్టుకుని వున్న జీవుడే క్షణంలోనైనా పారిపోతాడని భయపడుతూంటాను. మేమిద్దరం అతడిని అస్థిపంజరం అనీ ఇంకా చెప్పాలంటే ముద్దుగా పంజరం అని పిల్చుకుంటాం.

అప్పుడప్పుడు శ్రీమతి అతడేరిన బంగాళాదుంపల్లోంచి కొన్ని చెత్తవి తీసి బాబుగారికి అడిగినా చెడ్డసరుకిస్తానా అంటావు ఇదేమిటి!" అనడుగుతూంటుంది. పంజరం దానికి చలించడు. "అయ్యో మీకు నచ్చకపోతే తీసేయండమ్మా" అంటాడు. అప్పుడప్పుడు శ్రీమతి నువ్వు ధరమరీ ఎక్కువ చెబుతున్నావు తగ్గించాలి. అంటుంది. దానికి అస్థిపంజరం "బాబుగారే ధర చెబితే మాత్రం నేను కాదంటాను" అనేవాడు. శ్రీమతి ఏ ధర చెబితే దానికే అంగీకరించేవాడు.

పంజరం మనని బాగా మోసం చేస్తున్నాడు. లేకుంటే అంత ఎలా తగ్గించగలడు?" అంటుందామె.

"వ్యాపారానికి కొన్ని పరిమితులుంటాయి. అస్థిపంజరానికీ నాకూ చెప్పరాని అనుబంధమేర్పడింది. అందుకు [illegible]ను.." అన్నాను.

నా మా[illegible] చేసుకుందుకు శ్రీమతికి కొంతకాలం పట్టింది. మిగతావాళ్ళకు అస్థిపంజరం తను చెప్పిందానికి పైసా కూడా తగ్గించడు. నన్నుమ్మేరుకోనిచ్చినట్లు అందర్నీ కూరలేరుకోనివ్వడు.

శ్రీమతికి నేనూ నా నియమాలు చెప్పేశాను. అస్థిపంజరం దగ్గర కూరలేరకూడదు. బేరమాడకూడదు. మిగతావాళ్ళ దగ్గర ఆమె ఇష్టం.

మేము కలిసి బజారు వెళ్ళేది వారానికొక్కసారి. ఆ ఒక్కసారీ ఆమె సంతలో అస్థిపంజరముండకపోతే బాగుండును. మంచి కూరలు కొనుక్కోవచ్చు అనుకునేది. ఒక్కోసారి అస్థిపంజరం సంతలో కనబడేవాడు కాదు. అప్పుడామె సంతోషపడితే నేను బెంగపెట్టుకునేవాణ్ణి పాపం పోయాడేమో అని.

అస్థిపంజరానిదీ మాదీ పదేళ్ళ అనుబంధం. ఇప్పటికి అతడిలో ఏ మార్పు లేదు. సంతకు రానప్పుడల్లా అస్థిపంజరం పోయుంటాడని నేను భ్రమపడుతూనే వుండేవాణ్ణి. అది భ్రమగానే మిగిలిపోయేది.

నా భార్య గమనించిన విశేషం ఒకటుంది. సంతలో నన్ను చూడగానే "వచ్చారా బాబూ" అంటాడు పంజరం. అప్పుడు వాడి కళ్ళలో ఆప్యాయత, అభిమానం, ఆనందం కలగలిసిన వెలుగొకటి కనపడుతుందిట. అప్పుడప్పుడు శ్రీమతి ఒంటరిగా సంతకు వెడితే బాబు రాలేదా అనడుగుతాడట. అప్పుడతడి కళ్ళలో దిగులు, నిరుత్సాహం కనపడతాయట.

ఇది చాలా విచిత్రమైన అనుబంధ మనిపిస్తుందినాకు. అతడికి నేను చేసిందేమీ లేదు. అతడు కూరలమ్ముతాడు. నేను కూరలతడి దగ్గరే కొంటాను.

ఇటీవల మా ఇంటిపక్కకు కొత్తగా వచ్చాడు విజయ్. అతడికి కొత్తగా పెళ్ళయింది. కొత్తగా ఉద్యోగం వచ్చింది. సాధారణంగా ఇరుగుపొరుగులతో అంటీముట్టనట్లుగా ఉంటాం మేం. కానీ విజయ్‌తో అలా కుదరలేదు. భార్యాభర్తలిద్దరూ చలాకీ అయినవాళ్ళు. ఎందుకో వాళ్ళకు మేము నచ్చాము.

వాళ్ళెక్కువగా మాతో కలసి సంతకు రానడానికిష్టపడేవాళ్ళు.

"మంచి కూరలెలా ఏరుకోవాలో నేర్చుకుంటాను మీ దగ్గర" అంది విజయ్ భార్య శ్రీమతితో.

"ఏమేరుకోవడమో పంజరం ఎంత చెబితే అంతిచ్చి ఏమిస్తే అవి తీసుకుంటాం మేం" అంది శ్రీమతి విజయ్ భార్యతో.

పంజరం కథేమిటో వివరించి విజయ్ దంపతులకు చెప్పాల్సొచ్చింది. విజయ్ అంతావిని "మనం కూరలు కొనుక్కునేది మనకోసం కాదా" అన్నాడు.

నేను బదులివ్వలేదు.

సంతలో వాళ్ళకు పంజరాన్ని పరిచయం చేసాను. విజయ్ దగ్గర పంజరం నన్ను పొగిడి బాబుగారెప్పుడూ నా దగ్గర తప్పకూరలు కొనరు" అని గర్వంగా చెప్పుకున్నాడు.

"నేనూ నీ దగ్గరే కొందామని వచ్చాను. మంచి సరుకివ్వాలి" అన్నాడు విజయ్ వాడితో.

"బాబుగారికి అడిగితే మాత్రం చెడ్డసరుకు ఇస్తానా"

**కూరలమ్ముకునే వాడు, సంతకెడితే కనపడతాడు లేకుంటే లేదు. వాడికోసం మన తోటి వాళ్ళూ, పాటివాళ్ళూ, మనకోసం ప్రాణమిస్తున్నవాళ్ళూ అయినా — ఆ విజయ్ దంపతులతో చెడకొట్టుకుంటామా—?**

అన్నాడు పంజరం.

అతడిచ్చిన బంగాళాదుంపలు పరీక్షించగా అందులో ఓ దుంప కాస్త పక్కగా కుళ్ళిపోయింది. విజయ్ పంజరాన్ని ఏకేసాడు.

"దాందేముంది. [illegible] తీసుకోండి" అని అతడన్నప్పటికీ విజయ్ ఊరుకోలేదు.

అడిగితే మాత్రం వెద్ద సరుకిస్తానా అని చెప్పి ఇలాంటి సరుకెందుకిచ్చావ్ అని నిలదీసాడు.

అంతేకాదు ఎందుకో ఆ రోజు నుంచి విజయ్ పంజరాన్ని నిలదీయడమే పనిగా పెట్టుకున్నాడు.

మార్కెటంతా ధరలు వాకబు చేసివచ్చి పంజరం ధరలెక్కువగా ఉన్నాయనేవాడు. ఓసారతడు కూడా తక్కెడ తెచ్చి పంజరం తూచాక తనూ వెంటనే బంగాళాదుంపలు తూస్తే యాభై గ్రాములు తక్కువున్నాయి.

"సరుకు మంచిదివ్వవు. తూకంలో మోసం. ధర ఎక్కువ. నువ్వు చూస్తే ముసలాడివి. అశాశ్వతమైన ఈ శరీరం ముసలాడివి కాబట్టి నీకు మరింత అశాశ్వతం. ఈ వయసులో నీకీ బుద్ధులేమిటి?" అన్నాడు విజయ్.

పంజరం నా వంక చూసాడు. నేను గిల్టీగా ఫీలయ్యాను. విజయ్‌చేత నేనిలా అనిపిస్తున్నానని అతడనుకోవడం లేదుకదా! ఇందులో నా పాత్ర ఏమీ లేదన్నట్లు అతడివంక చూసాను.

పంజరం నను క్షమించినట్టే చూసి "వయసులో ఏముంది బాబు శరీరాలెవరికైనా అశాశ్వతమే?" అన్నాడు

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం" అన్నాడు విజయ్.

"సంతలో నాకంటే తక్కువకిచ్చేవాళ్ళూ వున్నారు. ఎక్కువకిచ్చేవాళ్ళూ వున్నారు. తూకంలో ఆ మాత్రం తేడాలందరి దగ్గరావస్తాయి. సరుకు విషయమూ అంతే! దేనికైనా నమ్మకముండాలి బాబూ! మా బాబుగారితో న చ్చారు కాబట్టి కానీ లేకపోతే..." అని ఆగాడు పంజరం.

"లేకపోతే" అన్నాడు విజయ్ ఆవేశంగా.

"లేకపోతే మీ క్కావాలంటే వేరేచోట కొనుక్కోండి అనేవాణ్ణి" అన్నాడు పంజరం.


నేను తెల్లబోయాను. ఆ మాత్రం మాటనడానికికూడా తటపటాయించాడా నా గురించి.

"నువ్వు చెప్పకపోయినా ఆ పని నేనెలాగూ చేస్తాను. ఇంత చూసాక నీ బాబుగారు మాత్రం నీ దగ్గర కొంటారనుకోకు" అన్నాడు విజయ్.

విజయ్ నా తరఫున కూడా అలాగనేస్తాడనుకోలేదు. అతడి మాటల్ని ఖండించాలనుకున్నాను కానీ మొహమాటం అడ్డొచ్చింది.

విజయ్ నాతో "మీకు మరీ ఇంత మొహమాటం పనికిరాదు. ఇతడి దగ్గర కూరలు కొడానికి వీల్లేదు" అని పంజరం ఎదురుగానే అని "మీరు కొంటారన్నా నేను కొననివ్వను" అన్నాడు.

ఆ రాత్రి విజయ్ జరిగిందంతా మా ఇంట్లో చెప్పి మీకు మొహమాటమైతే ఓ పని చేయండి. కొన్నాళ్ళపాటు మీ కూరలు కూడా నేనే తెచ్చిపెడతాను. మీరు సంతక



రావక్కర్లేదు అన్నాడు.

ఈ విషయమై శ్రీమతికీ నాకు ఘర్షణ కూడా జరిగింది. శ్రీమతి నా కోసం పంజరం దగ్గర కూరలు కొనడానికి ఒప్పుకుంది. కానీ ఇప్పుడామె అనేదేమిటంటే వాడెవడో సిమెంటు గట్టుమీద కూర్చుని కూరలమ్ముకునేవాడు. సంతకెడితే కనపడతాడు. లేకుంటే లేదు. వాడికోసం మనతోటివాళ్ళా సాటివాళ్ళా మన కోసం ప్రాణమిస్తున్న వాళ్ళా అయిన ఆ విజయ్ దంపతులతో వెడగొట్టుకుంటామా'' అని.

పంజరం దగ్గర కూరలు కొనడం స్వస్తి అని ఆమె స్పష్టం చేసింది.

సంతకు వెళ్ళి పంజరాన్ని చూడకుండా ఉండలేను. అందుకని ఓ వారం రోజులపాటు సంతకెళ్ళలేదు. శ్రీమతి తను వెళ్ళాలనుకుంది కానీ ''ఏమో నా మనసు కూడా పంజరం కొట్టుకే లాగుతుందండీ'' అంది.

కొన్ని అనుబంధాలు పోగొట్టుకున్నప్పుడు కానీ తెలియవు.

వారంరోజులపాటు విజయ్ దంపతులే మాకు కూరలు తెచ్చిచ్చేరు. కాని ఇలా ఎన్నాళ్ళు.

ఒకరోజు నేను శ్రీమతితో "నాకు పంజారన్ని చూడాలనిపిస్తోంది" అన్నాను.

"నాకూను!" అంది శ్రీమతి. ఆమె కనులలో రవ్వంత పశ్చాత్తాపం కూడా ఉంది.

''కానీ ఎలా విజయ్‌కు కోపం వస్తుంది'' అన్నాను.

శ్రీమతి తీవ్రంగా ఆలోచించింది. ''విజయ్‌కు చెప్పకుండా వెళ్ళిచూసొచ్చేద్దాం కూరలు కొనద్దు అంది.''

కూరలు కొనుక్కువస్తే పొరుగునే వున్న విజయ్‌కు అనుమానం కోపం రావచ్చు. అందుకని మా పిల్లలిద్దర్నీ విజయ్ ఇంట్లో అప్పజెప్పి ఏదో పని కల్పించుకుని అబద్ధం చెప్పి సంతకు వెళ్ళాం.

సంతలో పంజరం యదాస్థానంలో యధాప్రకారం కూర్చున్నాడు. నన్ను చూడగానే వచ్చారా బాబు అన్నాడు అతడి కళ్ళలో గొప్పవెలుగు.

నేనతడివంకే చూస్తున్నాను. ఈనాడు కాకపోయినా రేపైనా అతడి చావు తప్పదు. అతడి కనులలో ఇంకా కోరికలూ, అనుభూతులు వున్నాయా!

పంజరం తక్కెట తీసాడు.

''ఈరోజు కూరలకు రాలేదు. నిన్ను చూడాలని వచ్చాం అంది'' శ్రీమతి.

అతడు తక్కెడ దించేసి నిరుత్సాహంగా ''చూడ్డానికైనా సరే రోజూ రండి బాబు'' అన్నాడు.

అతడు నామీద నమ్మకం పోయిందా అనడగలేదు. కూరలు కొనమని కోరలేదు. తన నేరమేమీలేదని వేడుకోలేదు. చూడ్డానికైనా సరే రోజూ రమ్మన్నాడు.

అక్కణ్ణించి ఇంటికెళ్ళిపోయాక ''ఎలాగూ వాళ్ళకు నచ్చచెప్పి మళ్ళీ పంజరం దగ్గర కూరలు కొంటూండాలండీ'' అంది శ్రీమతి.

''నువ్వే ఏదో ఉపాయం చూడూ'' అన్నాను భారంగా.

''దేవుడేదో దారి చూపించకపోడు'' అంది శ్రీమతి వెంటనే. వచ్చిన సమస్య ఏమిటంటే మేమిద్దరంకూడా మొహమాటస్థులం. రోజూ ముఖం ముఖం చూసుకునే విజయ్‌తో అనవసరంగా గొడవ పెట్టుకోవడం మాకిష్టంలేదు. అందువల్ల పంజరం దగ్గర కూరలు కొనాలంటే మాకు దేవుడే ఏదో దారి చూపించాలి.

నిజంగానే దేవుడు దారి చూపించాడు. రెండ్రోజుల తర్వాత విజయ్ దంపతులు అనుకోని పని తగిలి ఊరుకు వెళ్ళారు. రెండు వారాలదాకా రామని వెళ్ళేటప్పుడు మాకు చెప్పారు.

''ఈ రోజే పంజరం దగ్గర కూరలు తెచ్చుకుందాం'' అన్నాను. శ్రీమతి అంగీకరించింది.

పిల్లల్ని పొరుగింట్లో అప్పజెప్పి కూరలకని వెళ్ళాం. కానీ సంతలో పంజరం కనడపలేదు. నా మనసు ఏదోలాగైపోయింది.

''పదేళ్ళుగా అతడిదగ్గర కూరలు కొంటున్నాం. చివరిక్షణాల్లో కొనలేకపోయాం. అతడి మనసెంతగా క్షోభించిందో. లేక అసలు మనం కూరలు కొనకపోవడం అతడికి షాకిచ్చిందేమో'' అన్నాను.

''చివరిక్షణాలేం కాదు. అతడు చాలాసార్లు సంతకు రాడు. వంట్లో బాగాలేదో ఇంకేమైనా పనులున్నాయో' అంది శ్రీమతి

విజయ్ వచ్చేలోగా ఆ రెండువారాల్లోను ఎనిమిదిసార్లు సంతకు వెళ్ళాం. పంజరం కనపడలేదు. అతడు చనిపోయుండాలనే నిర్ణయించుకున్నాం.

ఎవరి దగ్గర కూరలు కొంటున్నా నా బుర్రలో పంజరమే మెదుల్తూండే వాడు. ''బాబుగారడిగితే మాత్రం వెద్ద సరుకిస్తానా'' అన్న అతడి మాటలు చెవుల్లో గింగురు మంటూండేవి.




విజయ్ తిరిగివచ్చే రోజున వారికోసం వంటలు చేసుకుని సిద్ధంగా ఉన్నాం. ఏ రోజున ఏ ట్రైన్‌కు వస్తున్నది అతడు ముందుగా మాకు కార్డు రాసాడు.

అన్న టైముకి విజయ్ రాలేదు. స్టేషనుకి ఫోన్‌చేస్తే ఆ ట్రయిన్‌కు యాక్సిడెంటు అయిందన్నారు. ఆ రోజున కాకపోయినా తర్వాత వారం రోజులకు తెలిసింది. రైల్వే యాక్సిడెంట్లో విజయ్ దంపతులిద్దరు పోయారు.

ఈ వార్తకు మేము తిన్న షాక్ ఇంతా అంతా కాదు.

ఆ దంపతులిద్దరికీ ఎన్నో కోర్కెలు. ఎన్నో ఆశలు. భావి జీవితం గురించి ఎన్నో కలలు. నిజానికి వారికి నూరేళ్ళ భావి వుంది.

కానీ ఇప్పుడేరి వాళ్ళు.

శ్రీమతి ఏడ్చి ఏడ్చి రెండురోజులు భోజనమే చేయలేదు. నాకు వారంరోజులపాటు భోజనం సహించలేదు.

అయినవాళ్ళు పోతేనే మరిచిపోగల వావం దేవుడు మనుషుల కిచ్చాడు కాబట్టి కొన్నాళ్ళకు మళ్ళీ మామూలుగా ఉత్సాహమైన జీవితానికి అలవాటు పడ్డాం.

ఆ విధంగా రెండునెలలు గడిచాక ఒక రోజున మాకు సంతలో పంజరం కనపడ్డాడు. యధాస్థానంలో యధాప్రకారం.

నన్ను చూస్తూనే ''వచ్చారా బాబు'' అన్నాడు పంజరం.
అతడి కళ్ళలో గొప్ప వెలుగు.

చాలా రోజులుగా కనబడలేదు. ఏమయ్యావ్? అన్నాను పోయిన ఆత్మీయుడు దొరికిన అనుభూతి చెందాను నేను.

''యాత్రలకు వెళ్ళాను బాబూ! నాకు తెలిసిన మీబోటి వాళ్ళందర్నీ దేవుడు చల్లగా చూడాలని కోరుకున్నాను... అన్నట్లు మీతో వచ్చే ఇంకో బాబేడీ?'' అనడిగాడు పంజరం.

శ్రీమతి విషాదంగా ''రైల్వే యాక్సిడెంట్లో భార్యాభర్తలిద్దరూ పోయారు...'' అంది.

పంజరం షాక్ తిన్నట్లు కనబడలేదు. అలాంటి వార్తలతడెన్ని విన్నాడో ఏమో! అందుకే కాబోలు భారంగా నిట్టూర్చి ''నిజంగా ఈ శరీరం అశాశ్వతం బాబూ!'' అన్నాడు.

అప్పుడు నా బుర్రలో 'ముసలాడివి కాబట్టి ఈ శరీరం నీకు మరింత అశాశ్వతం'' అన్న విజయ్ మాటలూ వయసులో ఏముంది బాబూ శరీరాలెవరికైనా అశాశ్వతమే'' అన్న పంజరం మాటలూ తళుక్కుమన్నాయ్.

ఒక్కసారి విజయ్‌నూ, పంజరాన్నీ పక్కపక్కన ఊహించుకున్నాను. అప్పుడు అప్రయత్నంగా ఆ ఇద్దరి పక్కకూ నేనూ వచ్చాను.

నన్నూ, పంజరాన్నీ మార్చి మార్చి చూసుకున్నాను. అప్పుడు నాకు నా కంటే కూడా అస్థిపంజరమే శాశ్వతమనిపించాడు. ఎవరికైనా శాశ్వతమైనది అస్థిపంజరమే! శాశ్వతతకు మారురూపం కాబట్టే అతడికి నేను అస్థిపంజరం పేరుపెట్టానేమో!

మా ఇంటి పక్క విజయ్ ఇంట్లో శూన్యతకు కారణం ఊహకు అసాధ్యం కావచ్చు. కానీ అప్పట్నించీ అస్థిపంజరముండే గట్టు ఖాళీగా ఎప్పుడైనా కనపడినా అతడు పోయుంటాడని అనుకోవడం మానేశాను. *